క్లుప్తంగా

కాకుమాను డెప్యూటీ తహసీల్దార్‌గా దేవరాజ్



కాకుమాను: స్థానిక రెవెన్యూ కార్యాలయ డెప్యూటీ తహసీల్దార్‌గా టి.దేవరాజ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఆయన గుంటూరు వెస్టు మండల తహసీల్దార్ కార్యాలయంలో డీటీగా పని చేశారు. ఇటీవల నిర్వహించిన సాధారణ బదిలీల్లో భాగంగా కాకుమానుకు వచ్చారు. తహసీల్దార్ జె.ప్రసాదరావును కలసి జాయినింగ్ రిపోర్ట్‌ను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ మండల ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

పొన్నూరు ఏడీఏగా రామకోటేశ్వరి



చేబ్రోలు: పొన్నూరు వ్యవసాయ సబ్ డివిజన్ సంచాలకులు (ఏడీఏ)గా వి.రామకోటేశ్వరి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. బాపట్ల డీఏవో కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఆమె బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏడీఏగా పనిచేసిన సీహెచ్ తిరుమలాదేవిని గుంటూరులోని టెస్టింగ్ ల్యాబ్‌కు బదిలీ చేయడంతో ఆమె రిలీవ్ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన రామకోటేశ్వరి మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని రైతులకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రభుత్వ పథకాల్ని వారికి సకాలంలో అందిస్తూ, వ్యవసాయ రంగాభివృద్ధికి సహకరించనున్నట్లు తెలిపారు.

గ్రంథాలయంలో సందడిగా అంత్యాక్షరి పోటీలు



ప్రత్తిపాడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు ఉల్లాసంగా జరుగుతున్నాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి రోజుకో రకం పోటీల్ని నిర్వహిస్తున్నారు. లైబ్రేరియన్ అరుణ శుక్రవారం విద్యార్థులకు అంత్యాక్షరి, చెస్, లూడో పోటీలు నిర్వహించారు. చదువులకు సంబంధించిన అంశాలపై నిర్వహించిన అంత్యాక్షరిలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 11న బహుమతులు అందజేయనున్నట్లు అరుణ తెలిపారు. తొలుత ఎనిమిది గంటల నుంచి పది గంటల వరకు పుస్తక పఠనం, కథలు చదవడం, పుస్తక సమీక్ష నిర్వహించారు.

లారీ ఇంజిన్‌లో మంటలు.. దగ్ధం



గుంటూరు రూరల్: ఇంజిన్‌లో మంటలు వ్యాపించడంతో ఇసుక లారీ దగ్ధమైన సంఘటన శుక్రవారం నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం... తాడేపల్లి వైపు నుంచి చిలకలూరిపేటవైపుకు వెళుతున్న ఇసుక లోడు లారీ ఎన్‌హెచ్ 16లో బుడంపాడు వద్దకు రాగానే ఇంజిన్‌లో మంటలు వ్యాపించాయి. దీంతో లారీని రోడ్డు పక్కకు నిలిపి వేసి డ్రైవర్, క్లీనర్ దిగిపోయారు. వెంటనే గమనించిన రక్షక్ పోలీసులు ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో సిబ్బంది సంఘటన స్థలికి చేరుకుని మంటల్ని ఆర్పివేశారు. ప్రమాదంలో ఎవరికి హాని జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ముస్లింల అభ్యున్నతి వైఎస్సార్ సీపీతోనే సాధ్యం



కరపత్రాలను విడుదల చేస్తున్న వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జిలానీ తదితరులు

కొమ్మూరు(కాకుమాను): రాష్ట్రంలో ముస్లింల అభ్యున్నతి రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని వక్ఫ్ బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ జానీ సాహెబ్(జిలాని) పేర్కొన్నారు. మండలంలోని కొమ్మూరు మదీన మసీదులో శుక్రవారం 'హర్ దిల్ మే వైఎస్సార్ హమ్ జగన్‌కే సాథ్' అనే కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా జిలాని మాట్లాడుతూ మైనార్టీల గురించి అనునిత్యం ఆలోచించే దేశచరిత్రలో ఏకైక నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు.దివంగత నేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ కల్పించి, రాష్ట్రంలోని ముస్లిం కుటుంబాలలో దేవునిగా నిలిచారని ఆయన గుర్తు చేశారు. ఆయన తనయుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి ముస్లిం అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాల్ని ప్రవేశపెట్టారని చెప్పారు. రాష్ట్రంలోని ముస్లింలంతా వైఎస్సార్ సీపీతోనే ఉంటారని ఆయన తెలిపారు.కార్యక్రమంలో వక్ఫ్ బోర్డు డైరెక్టర్ పొన్నూరు షేక్ కరీముల్లా, షేక్ మున్న, మదీనా మసీదు ప్రెసిడెంట్ మస్తాన్ వలీ, ఆదాం షఫీ, రఫీ ఉల్లా, షబ్బీర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెరువుల అభివృద్ధికి గ్రూపులు కేటాయించండి

ఉపాధి హామీ ఏపీవో స్వరూపరాణి



తిమ్మాపురంలో అమృత్ సరోవర్ చెరువును పరిశీలిస్తున్న స్వరూపరాణి, ఏవో బాలమ్మ

ప్రత్తిపాడు: అమృత్ సరోవర్ చెరువుల అభివృద్ధికి ప్రత్యేకంగా గ్రూపుల్ని కేటాయించాలని పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ కార్యాలయం, ఉపాధి హామీ విభాగం ఏపీవో స్వరూపరాణి తెలిపారు. ప్రత్తిపాడు మండలం కొండేపాడు, తిమ్మాపురం, నిమ్మగడ్డవారిపాలెం గ్రామాల్లో అమృత్ సరోవర్‌కు ఎంపికైన రక్షిత మంచినీటి చెరువుల్ని శుక్రవారం ఆమె పరిశీలించారు. చెరువుల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, పరిశుభ్రత, బోర్డుల ఏర్పాటు వంటి పలు అంశాల్ని ప్రత్తిపాడు ఇన్‌చార్జి ఏపీవో సతీష్ ఆమెకు వివరించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ ఈ పథకానికి ఎంపికైన చెరువులకు ఒక్కొక్క యూజర్ గ్రూపును పర్మినెంట్‌గా కేటాయించాలని చెప్పారు. చెరువు గట్టుపై, ఆవరణలో గడ్డి, పిచ్చిమొక్కలు పెరగకుండా గ్రూపు సభ్యులు జాగ్రత్తలు తీసుకునేలా ఎప్పటికప్పుడు స్థానిక ఉపాధి హామీ సిబ్బంది పర్యవేక్షించాలని సూచించారు. గట్లపై నాటిన మొక్కలు ఎండిపోకుండా పాదులు తీసి నీటిని నింపాలని చెప్పారు. కార్యక్రమంలో గుంటూరు డ్వామా కార్యాలయం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పావులూరి బాలమ్మ, టీఏ పాల్గొన్నారు.

అమరవీరులకు ఘన నివాళులు



స్తూపం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు

పెదనందిపాడు: అమరవీరుల స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పాలపర్రులో శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన పాత బాపట్ల తాలుకా మృతవీరుల సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ చట్టాలతో రైతాంగానికి, ప్రజలకు తీవ్ర నష్టం జరుగుతోందన్నారు. అమరుల పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకుని నేటి మతోన్మాద బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లపై పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని మోదీ ప్రభుత్వం కార్పొరేట్లకు కారుచౌకగా అమ్ముతోందని, రాష్ట్రాల హక్కుల్ని కాలరాస్తోందని విమర్శించారు. అనంతరం స్తూపం వద్ద అమరవీరులకు ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కాకుమాను నాగేశ్వరరావు, దొప్పలపూడి రమేష్ , పోపూరి సుబ్బారావు, జరుగుల శంకరరావు, జంపని రామారావు, ముద్దన వెంకటేశ్వర్లు, దేవరకొండ శ్రీనివాసరావు, కొత్త వెంకట శివరావు, చుక్కా యానాదులు పాల్గొన్నారు.

సృజనాత్మకత పెంచేందుకు శిక్షణ శిబిరాలు దోహదం



శిబిరంలో చిన్నారులతో దేవానంద్, కార్యదర్శి దీక్షితులు

పెదకాకాని: విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచేందుకు గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరాలు దోహదం చేస్తాయని గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ తెలిపారు. పెదకాకాని గ్రంథాలయంలో నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని శుక్రవారం ఆయన కార్యదర్శి దీక్షితులుతో కలసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణ శిబిరాల్లో విద్యార్థులకు చదవడం, రాయడం, బొమ్మలు నేర్పించడం, మ్యూజిక్ వంటి అంశాలపై శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న క్లాసులు గురించి విద్యార్థుల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డెప్యూటీ లైబ్రేరియన్ ఝాన్సీలక్ష్మి, గ్రంథాలయాధికారి వేముల విజయ్ కుమార్ , రిసోర్స్ పర్సన్స్ గోళ్ళ వెన్నెల, లింగంగుంట సాహిత్య పాల్గొన్నారు.

నాలుగు హైస్కూళ్లకు నూతన ప్రధానోపాధ్యాయులు

ప్రత్తిపాడు: మండలంలోని నాలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో నూతన హెచ్‌ఎంలు బాధ్యతలు స్వీకరించినట్లు మండల విద్యాశాఖాధికారి సీహెచ్. రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇనుమెట్ల హైస్కూలు నుంచి బదిలీపై వచ్చిన హరిదాసు శ్రీనివాస్ ప్రత్తిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా, కోయవారిపాలెం హైస్కూలు హెచ్‌ఎంగా పెద్ది విజయలక్ష్మి, గొట్టిపాడు హైస్కూలు హెచ్‌ఎంగా వడ్డేపాటి చంద్రశేఖర్‌రావు, చినకోండ్రుపాడు హైస్కూలు హెచ్‌ఎంగా జంపాల విజయ్‌కుమార్‌లు మండలానికి బదిలీపై వచ్చారు. వీరు ఆయా పాఠశాలల్లో విధుల్లో చేరినట్లు ఎంఈవో పేర్కొన్నారు. కాగా పాతమల్లాయపాలెం, తిక్కిరెడ్డిపాలెం హెచ్‌ఎంల పాఠశాలలు కూడా బదిలీ అయినప్పటికీ ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా హెచ్‌ఎం పోస్టులు ఇవ్వలేదని ఎంఈవో కార్యాలయ వర్గాలు తెలిపాయి.

నేడు,రేపు గ్రూప్-2 సిలబస్‌పై అవగాహన సదస్సు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీపీఎస్సీ గ్రూప్-2 సిలబస్‌లో మార్పులపై రాష్ట్రస్థాయి ఫ్యాకల్టీ ఆధ్వర్యంలో శని, ఆదివారాల్లో అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు జయం స్టడీ సర్కిల్ డైరెక్టర్ కె.రాజకుమార్ శుక్రవారం తెలిపారు. అమరావతి రోడ్డులో భారత్‌పేట ఒకటో లైనులోని సంస్థ కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు 10 సబ్జెక్టుల్లో పది మంది అధ్యాపకులతో పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరు కానున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి జయం స్టడీ సర్కిల్ యాప్‌ను ఆవిష్కరిస్తారని తెలిపారు. వివరాలకు 63094 93634 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి కృషి



మాట్లాడుతున్న ఎంపీపీ భవనం పద్మలీల

చేబ్రోలు: రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని పొన్నూరు ఎంపీపీ భవనం పద్మలీల తెలిపారు. పొన్నూరు వ్యవసాయశాఖ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన మండల వ్యవసాయ సలహా మండలి సమావేశంలో ఆమె మాట్లాడారు. భూసారం పెంపుదలకు ప్రభుత్వం 50శాతం రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలు అన్ని ఆర్‌బీకేల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యుడు బొద్దులూరి రంగారావు మాట్లాడుతూ వ్యవసాయ వ్యర్థాల్ని కాల్చకుండా కలియదున్ని నేల ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. ఏవో దేగల వెంకట్రామయ్య మాట్లాడుతూ తొలకరి వర్షాలు కురవగానే రైతులు ఖరీఫ్ పంటకు అనుకూలంగా దుక్కులు దున్నుకోవాలని సూచించారు.

వాలీబాల్ పోటీల్లో బాపట్ల, హైదరాబాద్ జట్ల విజయం



పోటీలో తలపడుతున్న కాకుమాను- బాపట్ల జట్లు

పెదనందిపాడు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైఎస్సార్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు కొనసాగుతున్నాయి. మూడవ రోజు శుక్రవారం రాత్రి పలు జట్ల మధ్య పోటీలు హోరాహోరీగా జరిగాయి. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ జట్టు సభ్యుల్ని పరిచయం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేశారు. పోటీల్లో కాకుమాను, బాపట్ల, చెన్నై, హైదరాబాద్ జట్లు పాల్గొనగా, వాటిలో బాపట్ల, హైదరాబాద్ జట్లు విజయాలు సాధించాయి. కార్యక్రమంలో కాకుమాను జెడ్పీటీసీ సభ్యురాలు గుల్జార్ బేగం, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ షేక్ ఖాశీం పీరా, సర్పంచ్ దాసరి పద్మారావు పాల్గొన్నారు.

తాగి వాహనం నడిపినందుకు జరిమానా

గుంటూరు లీగల్: తాగి వాహనం నడిపిన వ్యక్తికి గుంటూరు ఆరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కొల్లి శృతవింద శుక్రవారం రూ.10 వేలు జరిమానా విధించారు. గుంటూరు ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఈ నెల 6వ తేదీన ఈస్ట్ ట్రాఫిక్ పోలీసులు గుంటూరు వన్‌టౌన్ పరిధిలోని నందివెలుగు రోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఆ సమయంలో పాత గుంటూరుకు చెందిన షేక్ జానీబాషా మద్యం తాగి బైక్ నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడ్ని శుక్రవారం కోర్టుకు హాజరుపర్చగా తన నేరాన్ని అంగీకరించాడు. దీంతో న్యాయమూర్తి నెల రోజులు జైలు లేదా రూ. 10 వేలు జరిమానా కట్టాలని తీర్పు చెప్పారు. దీంతో నిందితుడు రూ.10 వేలు జరిమానా చెల్లించాడు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పనులకు శంకుస్థాపన చేస్తున్న శివరామకృష్ణ తదితరులు

బీకేపాలెం(కాకుమాను): రాష్ట్రంలో ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డి పాలన చేస్తున్నారని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ అన్నారు.మండలంలోని బీకేపాలెం ఎస్సీ కాలనీలో ఇటీవల 18 కుటుంబాలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల స్థలాల్లో శుక్రవారం లెవలింగ్, రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో కులాలు, మతాలు, ప్రాంతాలు, పార్టీలు చూడకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల్ని అందిస్తున్న దేశ చరిత్రలో ఏకైక నాయకుడు రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన కొనియాడారు. జనరంజక పాలన సాగిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న నాయకుడని పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల్ని అణగతొక్కి, నేడు ఓట్ల కోసం పలువురు నాయకులు కొంగ జపం చేస్తున్నారని ఆయన విమర్శించారు.ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయ ఢంకా మోగించడం ఖాయమని తెలిపారు.కార్యక్రమంలో ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్ మెరిగల రవిబాబు, కాంద్రు హైమారావు, వ్యవసాయ సలహా మండలి మండల అధ్యక్షుడు కొత్త అమేష్ పాల్గొన్నారు.

ప్రత్తిపాడు తహసీల్దార్ సంజీవకుమారి బదిలీ

ప్రత్తిపాడు: స్థానిక తహసీల్దార్ ఎం. లీలాసంజీవకుమారి బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆమె నకరికల్లు మండలానికి వెళ్లారు. ఆమె స్థానంలో జిల్లా కలెక్టరేట్‌లో విధుల్ని నిర్వర్తిస్తున్న తహసీల్దార్ సిద్ధార్థను ప్రత్తిపాడుకు బదిలీ చేస్తూ జిల్లా ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సంజీవకుమారి శుక్రవారం మధ్యాహ్నం ప్రత్తిపాడు నుంచి రిలీవ్ కాగా, నూతన తహసీల్దార్ సిద్ధార్థ నేడో, రేపో బాధ్యతలు చేపట్టనున్నారు. ఆయన గతంలో ఇదే నియోజకవర్గంలోని పెదనందిపాడు మండల తహసీల్దార్‌గా పని చేశారు.

మలేరియాపై అప్రమత్తత అవసరం



ర్యాలీలో మాట్లాడుతున్న డాక్టర్ రామాంజిరెడ్డి

పెదకాకాని: మలేరియా జ్వరాలపై ప్రజలు అవగాహన కలిగి ఉండటం ద్వారా సోకకుండా జాగ్రత్తలు తీసుకోవచ్చని డాక్టర్ కె. రామాంజిరెడ్డి తెలిపారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని వెనిగండ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం గ్రామస్తులకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రామాంజిరెడ్డి మాట్లాడుతూ దోమకాటు ద్వారా మలేరియా, డెంగీ, చికున్ గున్యా, మెదడువాపు, బోధకాలు వంటి వ్యాధులు సోకే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ డ్రెయిన్లలో చెత్తాచెదారం వేయకుండా, మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. ఇంటి పరిసరాలలో పడవేసిన తొట్లు, పాతటైర్లు, డబ్బాలు, కొబ్బరిచిప్పలు వంటి వాటిలో వర్షపు నీరు చేరి దోమలు ఉత్పత్తి అవుతాయని వివరించారు. దోమల బెడద నుంచి రక్షణకు తెరలు వాడాలని సూచించారు. వ్యాధుల్ని త్వరగా గుర్తించడం ద్వారా చికిత్స చేయడం సులభమని తెలిపారు. జ్వరం తగ్గకపోతే వెంటనే దగ్గరలోనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చి చికిత్స చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ జి. శ్రీనివాసరావు, డాక్టర్ కె.ఎస్.ఎన్.ఎల్. చారి, హెచ్‌వీ మాణిక్యమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రింద హాస్పిటల్‌తో వరల్డ్ బ్రెయిన్ సొసైటీ ఒప్పందం

- బ్రెయిన్‌పై పరిశోధన చేసేందుకు గుంటూరు హాస్పిటల్‌తో ఒప్పందం చేసుకున్న అంతర్జాతీయ సంస్థ
- వినూత్న రీతిలో బ్రెయిన్ సర్జరీలు చేస్తున్న బ్రింద హాస్పటల్



జగన్నాథరావును సన్మానిస్తున్న శ్రీనివాసరెడ్డి

గుంటూరు మెడికల్: ఇంటర్నేషనల్ బ్రెయిన్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ సభ్యుడు ప్రొఫెసర్ కె.ఎస్.జగన్నాథరావు శుక్రవారం గుంటూరులోని బ్రింద హాస్పిటల్‌తో ఒప్పందం చేసుకునేందుకు ముందుకు వచ్చారు. అంతర్జాతీయంగా బ్రెయిన్‌పై పరిశోధనలు చేస్తున్న సంస్థలో భారతదేశం మొత్తానికి ఒకే ఒక సభ్యుడిగా కె.ఎస్.జగన్నాథరావు ఉన్నారు. పనామా దేశం నేషనల్ సైన్స్ సిస్టం విశిష్ట ప్రొఫెసర్‌గా, యూఎస్‌ఏ హోస్టన్‌లోని యూటీహెచ్‌ఎస్‌లో అధ్యాపకుడిగా ఈయన విధులు నిర్వహిస్తున్నారు. బ్రింద హాస్పిటల్ అధినేత, సీనియర్ న్యూరో సర్జన్ డాక్టర్ భవనం హనుమశ్రీనివాసరెడ్డి వినూత్నరీతిలో చాలెంజింగ్ కేసులకు బ్రెయిన్ సర్జరీలు చేస్తున్న విషయాన్ని తెలుసుకుని సదరు హాస్పిటల్‌తో పరిశోధనలపై ఒప్పందం చేసుకునేందుకు ముందుకు వచ్చామని కె.ఎస్.జగన్నాథరావు తెలిపారు. డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డి ఈనెల 3న పార్కిన్ సన్స్ (వణుకుడు జబ్బు)తో బాధపడుతున్న ఓ మహిళకు సుమారు 13 గంటల సేపు అరుదైన ఆపరేషన్ చేసి బ్రెయిన్‌లో చిప్స్ అమర్చి వణుకుడు జబ్బుకు చెక్ పెట్టారు. సదరు విషయం మీడియా ద్వారా వెలుగులోకి వచ్చింది. డాక్టర్ భవనం హనుమ శ్రీనివాసరెడ్డి గతంలో బాహుబలి సినిమా ల్యాప్‌ట్యాప్‌లో రోగికి చూపిస్తూ రోగి మెలకువగా ఉండగానే అరుదైన శస్త్రచికిత్స చేసి రికార్డు సృష్టించారు. గుంటూరు జీజీహెచ్ న్యూరోసర్జరీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న సమయంలో ఎపిలెప్సి రోగికి లైవ్ సర్జరీ చేసి మూర్ఛను నయం చేశారు. ఆ విషయాలు మీడియా ద్వారా వెలుగులోకి రావడంతో బ్రెయిన్‌పై వినూత్నంగా, పరిశోధనా పరంగా ఆపరేషన్లు చేస్తున్న ఆసుపత్రితో తాము ఒప్పందం చేసుకుంటున్నట్లు వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయిలో దేశ న్యూరోసర్జరీ విభాగానికి ఖ్యాతి తీసుకొస్తున్నందుకు డాక్టర్ హనుమ శ్రీనివాసరెడ్డికి అభినందనలు తెలిపారు.

పీఎం కిసాన్ పథకానికి ఈకేవైసీ తప్పనిసరి



ఈకేవైసీ విధానాన్ని పరిశీలిస్తున్న పద్మావతి

పెదనందిపాడు: పీఎం కిసాన్ పథకానికి ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని అగ్రికల్చర్ కమిషనరేట్ డెప్యూటీ డైరెక్టర్ పద్మావతి తెలిపారు. మండలంలోని ఉప్పలపాడు, నాగులపాడు గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. రైతులతో మాట్లాడారు. 14వ విడత పీఎం కిసాన్ పథక నిధులు ఖాతాల్లో జమ అవ్వాలంటే ప్రతి ఒక్కరూ ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె చెప్పారు. గతంలో వేలిముద్ర, ఓటీపీ పద్ధతిన చేసేవారన్నారు. ఇప్పుడు పేస్ రికగ్నిషన్ (ముఖ చిత్రం) కూడా అందుబాటులోకి వచ్చినట్లు ఆమె తెలియజేశారు. ఆమె వెంట ఏవోలు సరిత, సుధారాణి, సిబ్బంది ఉన్నారు.

వివాదాస్పదంగా మారిన క్యాంటీన్ వ్యవహారం

పెదకాకాని: స్థానిక శివాలయంలో క్యాంటీన్ వ్యవహారం వివాదంగా మారింది. గత వేలం పాటల సమయంలో హెచ్చు ధరకు మణికంఠ పేరుతో షేక్ షరీఫ్ దక్కించుకున్నాడు. అనంతరం గత ఏడాది క్యాంటీన్ పాటు క్యాటరింగ్ చేస్తున్న అతడు భోజనంతో పాటు చికెన్ కర్రీతో పట్టుబడ్డాడు. దీంతో అధికారులు వేలం పాట పాడిన వ్యక్తితో పాటు నిర్వాహకుడు షరీఫ్ పైనా పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు కూడా నమోదైంది. అప్పటి నుంచి సీజ్ చేసి ఉన్న క్యాంటీన్‌కు రెండు నెలల కిందట వేలం పాట నిర్వహించారు. ఇందులో పాటను దక్కించుకున్న ఉదయ్‌శంకర్ ఈనెల 4న ప్రారంభించాడు. ప్రారంభోత్సవం రోజు ఉదయ్‌శంకర్ స్నేహితుడు షరీఫ్ కూడా వచ్చాడు. అప్పటికే వ్యాపారాల విషయంలో పైచేయి సాధించేందుకు కొందరు వ్యక్తులు షరీఫ్‌పై నిఘా పెట్టి క్యాంటిన్‌లో ఉండగా ఫోటోలు, వీడియోలు తీసి వైరల్ చేశారు. అంతటితో ఆగకుండా ఈ వ్యవహారంపై దేవదాయశాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురపు శ్రీకాంత్‌కు ఏపీ హైందవ డెవలప్‌మెంట్ అధ్యక్షుడు అనిల్ బెహరా ద్వారా ఫిర్యాదు చేశారు. గతంలో ఆలయ ప్రాంగణంలో మాంసాహారంతో పట్టుబడిన వ్యక్తికి, అన్యమతస్తులు మళ్లీ బినామీ పేరుతో క్యాంటిన్ దక్కించుకున్నారని తమ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం ఆలయ అధికారుల వద్ద చర్చనీయాంశంగా మారింది. విషయం దేవదాయశాఖ కమిషనర్ దృష్టికి వెళ్లింది.

క్యాంటీన్‌కు, షరీఫ్‌కు సంబంధం లేదు

శివాలయంలో క్యాంటీన్‌కు, షరీఫ్‌కూ ఎటువంటి సంబంధం లేదని, స్నేహితునిగా మాత్రమే ప్రారంభోత్సవం రోజు ఆహ్వానించానని నిర్వాహకుడు ఉదయ్‌శంకర్ వివరణ ఇచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కొందరు వ్యక్తులు వారి మధ్య ఉన్న వ్యాపారలావాదేవీల్లో ఆధిపత్యపోరు కోసం వివాదాలు సృష్టిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. దీనిపై హిందూ దేవాలయాల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె. బసవరాజు శుక్రవారం ఆలయానికి వచ్చి క్యాంటీన్ నిర్వహణ వ్యవహారంపై విచారించినట్లు తెలిపారు. షరీఫ్ క్యాంటీన్ నిర్వహిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఏసీ పేర్కొన్నారు.